వైద్య కళాశాలలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -పాడేరు: స్థానిక మెడికల్ కళాశాలలో శుక్రవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిర్వహించిన రక్తదాన శిబిరానికి ఎంబిబిఎస్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రపంచ రక్త దాతల దినోత్సవం పురస్కరించుకొని నిర్వహిస్తున్న రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జమాల్ బాషా, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హేమలత పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదానంతో కలిగే ప్రయోజనాలను విద్యార్థినిలకు వివరించారు. జిల్లాలో రక్తపు నిలువలు పెంచేందుకు రెడ్ క్రాస్ సొసైటీ చేస్తున్న సేవలను అభినందించారు. శనివారం కలెక్టరేట్ లో నిర్వహించే ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాఘవేంద్ర, రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ ఎస్ గంగరాజు, కార్యదర్శి జి గౌరీశంకర్, కోశాధికారి పి.సూర్యారావు, సభ్యులు ప్రసాద్ నాయుడు, సంజీవరావు, రవి, జిల్లా కోఆర్డినేటర్ సత్యనారాయణ వైద్యులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ ట్రస్ట్‌కు డబ్బులు కట్టి మోసపోయిన

గిరిజనులకు న్యాయం చేయండి

ర్యాలీ చేపడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు, బాధితులు

ప్రజాశక్తి- చింతపల్లి: ఆదివాసి ట్రస్ట్ లో డబ్బులు కట్టి మోసపోయిన గిరిజన బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం చింతపల్లి మండలం అంతర్లలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. ట్రస్ట్ చైర్మన్ కోరాబు బాలం పడాల్ మోసపూరిత చర్యలకు వ్యతిరేకంగా ట్రస్ట్ బాధితుల సంఘం జిల్లా నాయకులు చిక్కుడు అశోక్ తో కలిసి ధర్నా నిర్వహించారు. బాధితులు అల్లూరి జిల్లా కలెక్టర్, ఎస్పీలకు వినతిపత్రాలు సమర్పించగా, కలెక్టర్ విచారణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. కేవలం ట్రస్ట్ చైర్మన్ తో పాటు ఆదివాసి ట్రస్ట్ సంబంధం లేని వ్యక్తులతో విచారణ పరిమితం చేయడాన్ని బాధితులు తప్పుపట్టారు. ఒక్కో ఐడికి రూ.12,200 చెల్లిస్తే నెలకు రూ.3,000 చొప్పున ప్రతినెల ఇస్తామని నమ్మించి రసీదు లేకుండా లక్షలాది రూపాయలు వసూలు చేశారని ఆరోపించారు. ఈ మేరకు కలెక్టర్ చింతపల్లిలో బహిరంగ విచారణ నిర్వహించి అన్ని వివరాలు వెలుగులోకి తేవాలని, పోలీసు శాఖ స్వయంగా కేసు నమోదు చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే కలెక్టరేట్ ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి ట్రస్ట్ వైస్ చైర్మన్ కొయ్యం చిన్నబ్బాయి, కార్యదర్శి మామిడి బాలయ్య గిరిజన సంఘం నేతలు ధనుంజయ్, సత్యనారాయణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పనస పండ్లు

ఏజెన్సీ పనసకు గిరాకీ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఏజెన్సీలో పండుతున్న పనసకు గిరాకీ ఏర్పడుతుంది. మన్యం పనసలో పోషకాలు మెండుగా ఉండడంతోపాటు ఒడిస్సా రాష్ట్రంలో దీనికి గిరాకీ ఉంది. దీంతో సీజన్ ప్రారంభం అయినప్పటి నుంచి, ఒడిస్సాలో, మైదాన ప్రాంతంలో గిరాకీ ఏర్పడుతుంది. దీంతో, ఆ ప్రాంత వ్యాపారులు వీటిని కొనుగోలు చేసేందుకు ఎగబడుతున్నారు. మండలం లోని అరుకు పంచాయతీ కేంద్రంలో శుక్రవారం జరిగిన వారపుసంతలో ఒక్కో పనసకాయకు రూ 100లు నుంచి రూ 120లతో గిరిజన రైతులు విక్రయించారు. మైదాన ప్రాంతం విశాఖపట్నం, నర్సీపట్నం, తుని, ఒడిస్సా ప్రాంతం నుంచి వ్యాపారులు కొనుగోలు చేసి తరలించుకుపోతున్నారు.

మాట్లాడుతున్న రైతు సంఘ నాయకులు కుంజా నాగిరెడ్డి

సబ్సిడీపై వరి విత్తనాలు అందించాలి : సిపిఎం

ప్రజాశక్తి - వి.ఆర్.పురం: మండలంలో వ్యవసాయ సీజన్ ప్రారంభం అవుతున్న దృష్ట్యా రైతాంగానికి సబ్సిడి వరి విత్తనాలు అందించాలని సిపిఎం మండల కమిటి ఒక ప్రకటనలో కోరింది. రేఖపల్లి సిపిఎం కార్యాలయంలో శుక్రవారం రైతు సంఘ నాయకులు కుంజా నాగిరెడ్డి అధ్యక్షతన జరిగిన పార్టీ సమావేశంలో జిల్లా కమిటి సభ్యులు సోయం చినబాబు మాట్లాడుతూ వర్షా కాలం సమీపించి ఏరువాక సాగిస్తున్న సమయం వచ్చిందని ప్రభుత్వ అధికార యంత్రాంగం తక్షణమే స్పందించి విత్తనాలు అందిస్తే ముందుగానే నారు వేసుకునే అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో మండల కమిటి సభ్యులు పంకు సత్తిబాబు, పోడియం శ్రీరామమూర్తి, గుండుపూడి లక్ష్మణరావు, కారం సుందరయ్య, శీరపు తాతబాబు, వడ్లాది రమేష్,పులి.బొజ్జి, తుర్రం బాబూరావు, కారం సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

యూనిటీ ఫర్ ఛారిటీ ట్రస్ట్ ఆధ్వర్యంలో

పాల డబ్బాల పంపిణీ

పాల డబ్బాలను పంపిణీ చేస్తున్న సురేంద్ర

ప్రజాశక్తి-పెదబయలు: యూనిటీ ఫర్ చారిటీ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెదబయలు మండలం రోగులు గ్రామంలో ముగ్గురు చంటి పిల్లలు ఉన్న బోండా కమలమ్మ కుటుంబానికి ఉచితంగా రెండేళ్ల పాటు ఉచిత పాల డబ్బులు పంపిణీ చేస్తామని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర భరోసా కల్పించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో రోగులు గ్రామంలో కమలమ్మకు ఉచితంగా పాల డబ్బాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ, పెదబయలు మండలం రోగులు గ్రామనికి చెందిన కమలమ్మ రెండు నెలల క్రితం ముగ్గురు చంటి పిల్లలు జన్మనిచ్చిందన్నారు. ముగ్గురు పిల్లలు బరువు తక్కువ కలిగిన ఆడ పిల్లలు జన్మనిచ్చిందన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండేళ్ల పాటు ఉచితంగా పాల డబ్బాలు అందిస్తామన్నారు. భవిష్యత్ లో ట్రస్టు తరపున మరిన్ని సేవలు ఆదివాసీలకు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రోగుల క్లస్టర్ గ్రామ పెసా ఉపాధ్యక్షులు, ఆదివాసి గిరిజన సంఘం మాజీ జిల్లా అధ్యక్షులు బొండా సన్నిబాబు, సీతగుంట పంచాయతీ ఉప సర్పంచ్ గంగాధరం, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్, ధర్మాన్నపడల్, సహాయ కార్యదర్శి టీ,సూర్యనారాయణ, వెచ్చంగి విశ్వనాథం పాల్గొన్నారు.

గృహాలను పరిశీలిస్తున్న వంతల దేవదాసు

పిఎం జన్‌మన్

బిల్లులు అందేలా చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: పీఎం జన్మన్ లబ్ధిదారులకు బిల్లులు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్సి,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వంతల దేవదాసు తెలిపారు. మండలంలోని కొత్త భల్లుగూడ గ్రామంలో జరుగుతున్న జన్మన్ ఇల్లులను శుక్రవారం స్థానికులతో కలిసి లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాల పనులను పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా దేవదాసు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఆదివాసీ గిరిజనుల కోసం ఎంతో ప్రతిష్టత్మకంగా ప్రధాన మంత్రి -జన్ జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ చేపట్టిందన్నారు. ఎటువంటి అలసత్వం లేకుండా గృహాలను త్వరితగిన పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్వాభి రాంచందర్, కూటమి కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న దృశ్యం

విమాన ప్రమాద మృతులకు నివాళి

ప్రజాశక్తి - సీలేరు: గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన విమాన ప్రమాద ఘటనలో మృతి చెందిన వారికి ఆత్మ శాంతి చేకూరాలని స్థానిక దుర్గాదేవి షెడ్‌లో స్థానిక నాయకులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా సదరం మారిబాబు మాట్లాడుతూ ఈ ఘటన తీవ్రంగా కలసివేసిందని విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కారే శ్రీనివాస్ గిరిజన సంఘ నాయకుడు మనోజ్ కుమార్, సీలేరు వర్తక సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు 13 మంది ఎంపిక

ప్రజాశక్తి-పాడేరు : అల్లూరి జిల్లా నుండి రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు 13 మంది ఎంపికయ్యారని జిల్లా యోగ నోడల్ అధికారి, ప్రత్యేక ఉప కలెక్టర్ ఎం వి ఎస్ లోకేశ్వరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక తలారిసింగి బాలుర ఆశ్రమ పాఠశాల ఇన్డోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీలను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జగన్మోహన్ రావు తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ స్థాయి యోగా పోటీలు నిర్వహించి గెలుపొందిన వారిని మండల స్థాయి పోటీలకు పంపించడం జరిగిందని, అందులో గెలుపొందిన వారిని మూడు ఐటిడిఎల ఫరిధిలో పోటీలు నిర్వహించి జిల్లా స్థాయికి ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా స్థాయికి ఎంపిక అయిన వారికి తలారిసింగి ఆశ్రమ పాఠశాలలో పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 13 మందిని ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తున్నట్లు తెలిపారు.

బోర్డు ఏర్పాటు చేయించిన ఇఒ లక్ష్మీనారాయణ

గోదావరిలో దిగొద్దని హెచ్చరిక బోర్డు

ప్రజాశక్తి - దేవీపట్నం : గోదావరి నదిలో నీరు అధికంగా ఉందని, స్నానాల రేవు మూసివేసినట్టు దేవాలయం వద్ద నీటి కుళాయిలు దగ్గర కేటాయించిన చోట మాత్రమే స్నానాలు చేయాలని పోచమ్మగండి ఆలయ ఇఒ లక్ష్మీనారాయణ హెచ్చరిక చేశారు. గోదావరి నది దగ్గరకు వెళ్ళుట అతి ప్రమాదకరం, ఫొటోలు, సెల్ఫీలు తీసుకోడానికి వెళ్లకూడదని, గోదావరి నది ఒడ్డుకు గానీ వెళ్ళకూడదని బోర్డు ఏర్పాటు చేయించారు. సిబ్బందికి సహకరించాలని తెలిపారు.

వినతులు స్వీకరిస్తున్న అధికారులు

'మీ కోసం'కు 105 వినతులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఐటిడిఎ సమావేశ మందిరంలో జిల్లా రెవిన్యూ అధికారి కె.పద్మలత, స్పెషల్ డిప్యూటి కలక్టర్ లోకేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం మీకోసం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారులు అందించిన ఫిర్యాదులు స్వీకరించారు.ఈ వారం మీకోసం కు 105 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ, ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని సూచించారు.

స్వీకరించిన ఫిర్యాదుల్లో కొన్ని :

ముంచింగిపుట్టు మండలం, ఏనుగురాయి పంచాయితి, నాడుమూరు గ్రామానికి చెందిన సీమాలి నారాయణరావు గృహ నిధులు గురించి 6 ఆరు మాసాల నుంచి అర్జీ పెట్టుకున్నా నిధులు మంజూరు కాలేదని వినతిని అందించారు. కొయ్యూరు మండలం అంతాడ గ్రామా పంచాయతి, ఎద్దు మామిడి, సింగూరు గ్రామస్తులు ఎస్.నూకరాజు, వి.రమణ బాబు, యు.సోమరాజు తమ గ్రామానికి బిటి రోడ్డు మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు.

కొయ్యూరు మండలం అంతాడ గ్రామా పంచాయతి ఎద్దు మామిడి గ్రామస్తులు వీ.రమణ బాబు, ఎస్.ఎర్రిబాబు, ఎస్.బాలరాజు గ్రామానికి వాటర్ టాంక్ నిర్మాణము చేపట్టాలని అర్జీ పెట్టారు.

పాడేరు మండలం జల్లిపల్లి గ్రామం నుండి మజ్జి రవికుమార్ అమ్మాయికి ఏకలవ్య స్కూల్లో సీటు ఇప్పించగలరని కోరారు. చింతపల్లి మండలం, లంబసింగి గ్రామస్తులు తమ గ్రామములో నాటు సారా నిర్మూలించాలని అర్జీ పెట్టారు.ఈ కార్యక్రమంలో సర్వే అండ్ ల్యాండ్స్ డిడి కె.దేవేంద్రుడు, డ్వామా పిడి డి.విద్యాసాగర్, ఉద్యానవన శాక డిడి రమేష్ కుమార్ రావు, పరిశ్రమల శాఖ డిడి ఆర్ వి రమణరావు , పశుసంవర్ధక శాఖ అధికారి సిహెచ్ నరసింహులు, డిఎంహెచ్ఒ జమాల్ భాషా, అగ్రికల్చర్ ఆఫీసర్ బిఎస్ఎస్ నంద్ పాల్గొన్నారు.

ఊబలగరువుకు రోడ్డు నిర్మించండి

ప్రజాశక్తి-చింతపల్లి: గత వైకాపా ప్రభుత్వంలో గ్రామాల్లో సమస్యలు పరిష్కారం కాలేదని జనసేన పార్టీ మండలాధ్యక్షుడు వంతల బుజ్జిబాబు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని అంజలిశనివారం పంచాయతీ పరిధిలోని మారుమూల ఊబలగరువు గ్రామానికి తారు రోడ్డు నిర్మించాలని అధికారులను ఆయన మొరపెట్టుకున్నారు. గ్రామస్థుల ఆహ్వానంతో శుక్రవారం గ్రామాన్ని సందర్శించిన ఆయన గ్రామ ప్రజలతో గ్రామాల సమస్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఊబలగరువు గ్రామానికి నాలుగు కిలోమీటర్ల మేర తారు రోడ్డు నిర్మించాలన్నారు. తాగునీరు, ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడి భవనాల తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన మండల కోఆర్డినేటర్ వంతల రాజుబాబు, సీనియర్ నాయకులు మఠం శ్రీనివాస్, గసాడి దిలీప్, పాంగి శివ, కిలో కోటేశ్వరరావు, మర్రి అనిత, వంతల లక్ష్మణ్, సిందేరి రామదాస్, మరి శంకర్, మర్రి శ్రీనివాస్, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థిమిత్ర' కిట్లు పంపిణీ

అడివి వెంకన్నగూడెం పాఠశాలలో ఎంపిపి లక్ష్మి ఆధ్వర్యంలో కిట్స్ అందిస్తున్న దృశ్యం

అన్నవరం పాఠశాలలో కిట్స్ పంపిణీ చేస్తున్న హెచ్ఎం నాగమణి

ప్రజాశక్తి - విఆర్‌పురం : మండలం రామవరం పంచాయతీలో అడివి వెంకన్నగూడెం ప్రాథమిక పాఠశాలలో ఎంపిపి కారం లక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్సులు, టై, స్కూల్‌బ్యాగ్, బెల్టు, క్వాలిటీ మెటీరియల్ విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు చదువులో ఉన్నంత స్థాయికి వెళ్ళాలని ఉపాధ్యాయులకు తల్లిదండ్రు లకు మంచి పేరు తీసుకురావాలని చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యవర్గ సభ్యులు కారం సుందరయ్య, సీనియర్ నాయకులు కుంజ నాగిరెడ్డి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అన్నవరం పాఠశాలలో..

మండలంలోని అన్నవరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం విద్యార్థిమిత్ర కిట్స్ పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు నాగమణి సమక్షంలో స్కూల్ విద్యాకమిటి చైర్మన్ బురక కన్నారావు, సోడి సత్యనారాయణ, మడకం సుబ్బరావు చేతుల మీదుగా విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్స్ పంపిణీ చేశారు. విద్యార్థులకు సన్నబియ్యంతో వండిన మధ్యాహ్న భోజనం అందించారు.

వైద్యశాఖ బదిలీల్లో అన్యాయం

గిరిజన మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైద్య ఆరోగ్యశాఖ బదిలీల ప్రక్రియలో పాడేరు ఐటిడిఎ పరిధిలో పనిచేస్తున్న గిరిజన మహిళ ఉద్యోగులకు అన్యాయం జరిగిందని, దీనిని సరిచేసి న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి శోభన్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ వైద్యవిభాగంలో ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ఐదు సంవత్సరాలు దాటి పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీలను ఆన్ లైన్ ప్రక్రియ ద్వారా నిర్వహించాలని డిమాండ్ చేశారు. జోన్ -1 పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ ఒకే వేదికలో ఆన్ లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్‌ను కోరామన్నారు. ఇదే వినతిపత్రాన్ని స్పెషల్ చీఫ్ సెక్రటేర్‌కు పోస్టల్ ద్వారా పంపడం జరిగిందన్నారు. జోన్ -1 ప్రక్రియ అందరికీ ఒకేలా జరగాలి ఉండగా రీజనల్ డైరెక్టర్ పాడేరు ఏజెన్సీలో పనిచేస్తున్న మహిళా గిరిజన ఉద్యోగులను విడగొట్టి వేరే జాబితా తయారు చేశారన్నారు. ఆరోగ్య శాఖ లో పనిచేస్తున్న గిరిజన మహిళలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంధ్య, సుగుణ,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

15న మోకాళ్ల సమస్యలపై విశాఖలో సదస్సు

బ్రోచర్ విడుదల చేసిన డాక్టర్ శివానంద

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఉత్తరాంధ్ర ఆర్థోపెడిక్ అసోసియేషన్, కిమ్స్ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన మోకాళ్ల సమస్యలపై సదస్సు నిర్వహించన్నుట్టు కెజిహెచ్ ఆర్థోపెడిక్ విభాగాధిపతి, ఆంధ్రా వైద్యకళాశాల అధ్యాపకుడు డాక్టర్ శివానంద తెలిపారు. దీనికి సంబంధించి శుక్రవారం బ్రోచర్ విడుదల చేశారు.వివిధ కారణాల వల్ల మోకాళ్లలో గాయాలై లోపలి భాగంలో ఉండే మెనిస్కస్, లిగమెంట్లు టేర్ సమస్యలతో పాటు దీర్ఘకాలంలో మోకాళ్లు త్వరగా అరిగిపోవటం, రోడ్డు ప్రమాదాలు, క్రీడల్లో అయ్యే గాయాలు, ఇంట్లో జారిపడడం వల్ల కలిగే మోకాళ్ళ సమస్యలపై వైద్యులకు, సామాన్య ప్రజలకు అవగాహన కల్పించేందుకు విశాఖపట్నంలోని కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఫోర్ పాయింట్స్ బై షెరటాన్ హోటల్లో ఒక రోజు సదస్సు నిర్వహిస్తున్నారు. ఉత్తరాంధ్ర ఆర్థ్రోస్కాపిక్ అసోసియేషన్, వైజాగ్ ఆర్థ్రోస్కాపిక్ అసోసియేషన్ సహకారంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ సదస్సుకు ఛైర్‌పర్సన్‌గా కేజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగాధిపతి, ఆంధ్రా వైద్యకళాశాల అధ్యాపకుడు డాక్టర్ శివానంద వ్యవహరిస్తున్నారు. సదస్సుకు ఉత్తరాంధ్రవ్యాప్తంగా ఉన్న 150 మంది ఆర్థోపెడిక్ వైద్యులు హాజరవుతున్నారు. వీరందరికీ కొత్త టెక్నిక్‌ల గురించి చెప్పేందుకు అహ్మదాబాద్, కోయంబత్తూరు లాంటి నగరాల నుంచి పలువురు అనుభవజ్ఞులైన వైద్యనిపుణులు హాజరవుతున్నారు. కార్యక్రమంలో సదస్సు నిర్వాహక బృందం సభ్యులు డాక్టర్ శ్రీనివాస్ గొల్లంగి, డాక్టర్ ఆర్.రాజేష్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ సంతోష్ రాం గడ్డం తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేసిన నాయకులు, ప్రజా ప్రతినిధులు

ఎల్లవరం - అరగడపల్లి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - జికె వీధి : మండలంలోని వంచుల పంచాయితీ ఎల్లవరం కట్టు వీధి నుండి అరగడపల్లి గ్రామం వరకు పిఎం జన్‌మన్ ద్వారా కోటి 53 వేల వ్యయంతో రోడ్డు నిర్మాణ పనులకు జికె వీధి ఎంపిపి బోయిన కుమారి, స్థానిక సర్పంచ్ వనపల కాసులమ్మ, కూటమి నాయకులు ఆధ్వర్యంలో శుక్రవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు వంతల చిలకమ్మ, కొర్ర రఘునాథ్, కూటమి నాయకులు పోత్తూరు కొండబాబు, మధు రఘువంశి, వైసిపి నాయకులు పోత్తూరు గంగరాజు, అరడ సత్తిబాబు వనపాల రాజేష్, కంకిపాటి నడిపిపడాల్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందిస్తున్న ములకాల సాయికృష్ణ

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత

ప్రజాశక్తి - వి.ఆర్.పురం: మండలంలోని సీతంపేటలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన ముత్యాల సుందర్ రాములు, ముత్యాల రమేష్ కుటుంబాలకు జనసేనపార్టీ ఆధ్వర్యంలో పార్టీ మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. సమస్యను ప్రభుత్వదృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. జనసేన పార్టీ అండగా ఉంటుందన్నారు.కార్యక్రమంలో జనసేన పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు వీరమహిళ బాగుల ప్రమీల, మండల కార్యదర్శులు బాగుల అంజన్ రావు, పెట్టా నాగేంద్రబాబు, యూత్ నాయకులు పెడపెట్ల పవన్‌కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణసామగ్రి వితరణ

ముత్యాల రమేష్ , ముత్యాల సుందర రామయ్యకు ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జెకె సిటీట్రస్ట్ చైర్మన్ జమాల్‌ఖాన్ శుక్రవారం పరామర్శించి ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇనుప పైపులు, సిమెంటు రేకులు అందజేశారు.

నేటి నుంచి గ్రామాల్లో యోగా సాధన

మాట్లాడుతున్న జెసి

ప్రజాశక్తి -పాడేరు, : గ్రామ, మండల, జిల్లా స్థాయి యోగా పోటీలు పూర్తయ్యాయని, ఈ నెల 14 వ తేదీ శనివారం నుండి అంతర్జాతీయ యోగా దినోత్సవం 21వ తేదీ వరకు ప్రతి సచివాలయ పరిధిలో యోగ సాధన జరగాలని సంయుక్త కలెక్టర్ డా. ఎం జె అభిషేక్ గౌడ సూచించారు. శుక్రవారం జేసి జిల్లా, మండల అధికారులు, యోగ ట్రైనర్లతో నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా 3,292 యోగా కేంద్రాలను ఎంపిక చేయడం జరిగిందని, అన్ని కేంద్రాలలో ఈ వారం రోజులు యోగ సాధన జరగాలని ఆదేశించారు. జిల్లా అధికారులు, డివిజన్, మదన్ల, గ్రామ స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు వారికి దగ్గరగా ఉన్న సచివాలయ ఫరిధిలో యోగ సాధన చేయాలని సూచించారు. జిల్లా అధికారులు యోగ సాధన చేస్తూనే యోగ సాధన పర్యవేక్షించాలని ఆదేశించారు. అదేవిధంగా యోగ సాధన పోటోలను నోట్ కేమ్ యాప్ లో అప్ లోడ్ చేయాలని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది ప్రజలను చైతన్య పరచి యోగ సాధనకు ప్రోత్సహించాలని ఆదేశించారు. జిల్లాలో 4.62 లక్షల మంది యోగ సాధనకు నమోదు చేసుకున్నారని జేసి తెలిపారు. నమోదు చేసుకున్న వారందరూ శనివారం నుండి వారం రోజులు యోగ సాధన ప్రక్రియలో పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో జిల్లా యోగ నోడల్ అధికారి ఎం వి ఎస్ లోకేస్వరరావు, జిల్లా, మండల స్థాయి అధికారులు, యోగ ట్రైనర్లు పాల్గొన్నారు.

నేడు గ్రంథాలయ పునర్వికాస వేదిక

మేధోమథన సదస్సు

ప్రజాశకి- సీతమ్మధార : ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక ఆధ్వర్యంలో ఈనెల 14న శనివారం ఉదయం 10.30 గంటలకు విశాఖ పౌరగ్రంథాలయంలో రాష్ట్రస్థాయి ఉద్యమంలో భాగంగా మేధా మథన కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు వేదిక రాష్ట్ర కన్వీనర్ వల్లూరి శివప్రసాద్ శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా 'ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయాల దశ, దిశ – ప్రజల కర్తవ్యం' అంశంపై మేధావుల అభిప్రాయాలను, సూచనలనూ క్రోడీకరించి ప్రభుత్వం, ప్రజల దృష్టికి తీసుకెళ్లే కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఉత్తరాంధ్రలో తొలిగా శనివారం విశాఖపట్నంలో సదస్సు జరుగుతుందన్నారు.

ద్రవిడ వర్సిటీ పూర్వ విసి ప్రొఫెసర్ కెఎస్.చలం అధ్యక్షత వహించే కార్యక్రమంలో శ్రీకష్ణదేవరాయ, అంబేద్కర్ వర్సిటీల పూర్వవిసి ఆచార్య హెచ్.లజపతిరాయ్, దామోదరం సంజీవయ్య లా వర్సిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై. సత్యనారాయణ, విక్రమ సింహపురి వర్సిటీ పూర్వ విసి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు ఆచార్య సుదర్శన్ రొక్కం, ఆదికవి నన్నయ్య వర్సిటీ పూర్వ విసి ప్రొఫెసర్ ముర్రు ముత్యాలనాయుడు, విశ్రాంత డిజిపి అత్తిలి సుధాకరరావు, ప్రజాశక్తి బుక్ హౌస్ సంపాదకులు ఎంవిఎస్ శర్మ, సాహితీ వేత్తలు గంటేడ గౌరనాయుడు, జర్నలిస్టు నల్లి ధర్మారావు తదితర మేధావులు పాల్గొంటారు. వేదిక విశాఖ జిల్లా కన్వీనర్ బసు పోతన, అరసం విశాఖ జిల్లా కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, కార్టూనిస్ట్, రచయిత హరివెంకట రమణ, వేదిక శ్రీకాకుళం కన్వీనర్ బుడుమూరు సూర్యారావు, విజయనగరం కన్వీనర్ రత్నాల బాలకృష్ణ సభను నిర్వహిస్తారన్నారు.

మెగా డిఎస్‌సి పరీక్షకు 95.85 శాతం హాజరు

ప్రజాశక్తి- ఆరిలోవ : ఉపాధ్యాయ నియామక మెగా డిఎస్‌సి 2025లో భాగంగా శుక్రవారం నిర్వహించిన పరీక్షకు 95.85 శాతం అభ్యర్థులు హాజరైనట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. జిల్లాలో ఉదయం 5, మధ్యాహ్నం 8 కేంద్రాల్లో మొత్తం 4,151 మంది అభ్యర్థులు హాజరు కావలసి ఉండగా, 3,979 పరీక్ష రాశారని, 95.85 శాతం హాజరు నమోదైందన్నారు. తాను ఒకటి, ఫ్లైయింగ్ స్క్వాడ్ నాలుగు పరీక్ష కేంద్రాలను సందర్శించి తనిఖీలు చేశామన్నారు.

గిరిజన గురుకులాల్లో సీట్లు పెంచాలి

- ఎస్ఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి-పాడేరు: ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల కళాశాలలో అడ్మిషన్ల కోసం రెండో కౌన్సిలింగ్ నిర్వహించాలని, విద్యార్థులకు సీట్లు పెంచాలని అల్లూరి జిల్లా ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు కార్తీక్ శ్రీను అధికారులకు విజ్ఞప్తి చేశారు.. ఈ మేరకు శుక్రవారం పాడేరు ఐటిడిఏ గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పాడేరు ఏజెన్సీ 11 మండలాల్లో బాలికలకు గురుకుల కళాశాలలు మూడు మాత్రమే ఉన్నాయని, బాలికలకు అదనంగా గురుకుల కళాశాలలు ఏర్పాటు చేయాలన్నారు. ఉన్న వాటిలో అదనంగా సీట్లు పెంచాలని, పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్, గ్లాస్, బ్యాగ్స్ కచ్చితంగా ఇవ్వాలన్నారు.ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ ఫీజులు తగ్గించాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కూడా పుస్తకాలు, నోట్ బుక్స్ లు, యూనిఫామ్ పంపిణీ చేయాలన్నారు.అన్ని విద్యాసంస్థలలో హెల్త్ వర్కర్స్, వాచ్మెన్ లను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహకార్యదర్శి చిన్నారావు ఉన్నారు.

వినతిపత్రాన్ని ఇస్తున్న నాయకులు

రంపుల గ్రామ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించిన గ్రామస్తులు.

ప్రజాశక్తి-జీ.కేవీధి : పాడేరు నియోజకవర్గ ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజుకు గూడెం కొత్త వీధి మండలం పెదవలస పంచాయతీ రంపుల గ్రామస్తులు గ్రామ సమస్యలు తీర్చాలని పాడేరులోని ఎమ్మెల్యే కార్యాలయానికి చేరుకుని వినతిపత్రాన్ని అందజేశారు. రంపుల గ్రామంలో ప్రధానంగా చెరువు పంట కాలువ పూడికతీత, జిసిసి కొత్త భవనం మంజూరు, హైవేలో రోడ్డు ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆయనకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామ సమస్యలపై అధికారులు దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కంకిపాటి వీరన్నపడాల్, చల్ల నరేష్, కంకిపాటి రామారావు, పోత్తూరు గోపాలకృష్ణ, వీరభద్రంపడాల్, దామనపల్లి సర్పంచ్ కుందేరి రామకృష్ణ, లకవరపేట సర్పంచ్ వీరేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

కొందరికే.. అరకొరగా..

- తల్లికి వందనంపై పలువురి పెదవివిరుపు!

ప్రజాశక్తి-గోపాలపట్నం : కూటిమి ప్రభుత్వం ఎన్నికల హామిల్లో సూపర్ సిక్స్ పథకల్లో ఒకటైన తల్లికి వందనం పథకం కొందరికే వర్తించిందని కొంత మంది వినియోగదారులు వాపోతున్నారు. గత ప్రభుత్వం అనుసరించిన విధానాన్నే కూటిమి ప్రభుత్వం అనుసరించిందని చెపుతున్నారు. కుటుంబంలో నాలుగు చక్రాలు వాహనం ఉన్నా. అలాగే విద్యుత్ వినియోగం సగటున 300 యూనిట్లు కంటే ఎక్కువుగా ఉన్నారని,. గ్రామీణ ప్రాంతాల్లో మెట్ట భూమి 10 ఎకరాలు కంటే ఎక్కువ ఉన్నా, కుటుంబంలో ఆదాయపు పన్ను చెల్లించినవారు ఉన్న, సరైన ఆదాయ ధ్రువీకరణ పత్రాలు లేనందున వీరిని అనర్హులుగా ప్రకటించి, ఈ పథకాన్ని పథకం వర్తింపచేయలేదు. విద్యుత్ బిల్లు సగటు మధ్యతరగతి ఇంట్లో 300 యూనిట్లు వేసవిలో దాటిపోతుందని, దానిని ప్రమాణకంగా తీసుకొని పథకం అపేయడం సరికాదని లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. అలాగే ప్రతి విద్యార్థికి రూ.15వేలు ఖాతల్లో వేయాల్సింది రూ.13వేలు మాత్రమే వేశారని చెపుతున్నారు. మిగిలిన రూ.రెండు వేలను పాఠశాల అభివృద్ధి నిధి కింద ఉపయోగిస్తారని ప్రభుత్వం పేర్కొంటుంది. ఇదిలా ఉండగాకొంత మంది లబ్ధిదారులకు తల్లికి వందనం వారి బ్యాంక్ ఖాతాల్లో జమకాలేదు. రాని వారు ఉన్న లోపాలను సరిచేసుకుని దరఖాస్తు చేసుకుంటే పథకాన్ని వర్తింపజేస్తామని అంటున్న ప్రభుత్వం ,దీనికి వచ్చేనెల ఐదోతేదీ నాటికి తుది జాబితా ఖరారౌతుందని చెబుతున్నారు.

రక్తదానంతో ఆరోగ్యం, ఆనందం

- విమ్స్‌లో ప్రపంచ రక్తదాతల దినోత్సవం

ప్రజాశక్తి - అరిలోవ : ఆరునెలలకోసారి రక్తదానం చేయటం ద్వారా ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం చేశామన్న సంతృప్తితోపాటు వ్యక్తిగతంగా ఆరోగ్యవంతులుగా ఉండవచ్చునని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు అన్నారు. ప్రపంచ రక్తదాన దినోత్సవ సందర్భంగా శుక్రవారం విమ్స్ ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ముందుగా ఆస్పత్రి సిబ్బంది నిర్వహించిన ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీముగింపులో డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ సరైన సమయంలో రక్తం అందక అనేకమంది ప్రాణాలను కోల్పోతున్నారన్నారు. రక్తదానానికి యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఒక్క యూనిట్ రక్తంతో ఆపదలో ఉన్న ముగ్గురి ప్రాణాలను రక్షించవచ్చున్నారు. విమ్స్ ఆస్పత్రిలో ఆరు నెలలుగా బ్లడ్ బ్యాంక్ సేవలు అందుబాటులోకి వచ్చాయని, ఇప్పటివరకు ఎనిమిది రక్తదాన శిబిరాలను నిర్వహించగా 542 యూనిట్ల రక్తాన్ని సేకరించామన్నారు. త్వరలో రక్తహీనతతో బాధపడుతున్న తలసేమియా రోగులకు విమ్స్ ఆస్పత్రిలో ప్రత్యేక వార్డును ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రక్తదానంపై అవగాహనకు పోస్టర్లను ఆవిష్కరించారు కార్యక్రమంలో విమ్స్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి

ప్రజాశక్తి-పాడేరు: 1/70 భూ బదలాయింపు నిషేధ చట్టం అమలులో ఉన్న అల్లూరి జిల్లా 5వ షెడ్యూల్ ప్రాంత పరిధి లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు పలు ప్రధాన కేంద్రాల్లో ఆక్రమణలు తొలగించి రోడ్లు 100 అడుగులు వెడల్పు చేయాలని పాడేరు శాసన సభ్యులు వైసీపీ అల్లూరి జిల్లా అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పాడేరు జిల్లా కేంద్రంలో నిత్యం ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందని, అత్యవసర సమయాల్లో ట్రాఫిక్ జామ్ అయి రోగులు సైతం సకాలంలో ఆస్పత్రులకు వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. గిరిజన ప్రాంత వాసులు అందరు అభివృద్ధి కోరుకుంటున్నారని, పట్టణ ప్రాంతాలు అభివృద్ధికి భవిష్యత్ కార్యాచరణ చూసుకుని పలు రాజకీయ పార్టీల నాయకులు గిరిజన పట్టణ ప్రాంత అభివృద్ధికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఎన్ని రాజకీయ ఒత్తిళ్లు వచ్చినా ఈ రోడ్డు ఆక్రమణల తొలగింపు, విస్తరణ పనులు ఆగకుండా చర్యలు తీసుకోవలసిన బాధ్యత జిల్లా కలెక్టర్ పై ఉందని ఇందుకు అనుగుణంగా చర్యలు చేపట్టి కోర్టు ఆదేశాలను అమలు చేయాలని పాడేరు శాసన సభ్యులు కలెక్టర్ ను కోరారు. లేని పక్షంలో స్థానిక గిరిజనులు, ఆదివాసీ సంఘాలతో కలిసి వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

అక్రమ నిర్మాణాలను తొలగించాలి

హుకుంపేట: హుకుంపేట మండల అభివృద్ధిలో భాగంగా చేపట్టిన రహదారి విస్తరణ పనులను ఆదివాసీ గిరిజన సంఘం స్వాగతించినప్పటికీ, అధికారులు ఆదేశాలు ప్రజలను గందరగోళంలోకి నెట్టుతున్నాయని మండల గిరిజన సంఘం నేతలు వ్యాఖ్యానించారు. గిరిజన సంఘం మండల కార్యదర్శి టి.క్రిష్ణారావు, నాయకులు వి.లక్ష్మణరావు మాట్లాడుతూ, కోర్టు ఆదేశాలను తప్పకుండా అమలు చేయాలని, రహదారి విస్తరణ అవసరం పెరుగుతున్న జనాభా, ట్రాఫిక్ దృష్ట్యా తప్పనిసరి అని తెలిపారు.రోడ్డు మార్జిన్ దాటి అక్రమంగా నిర్మించిన షాపులతో రాకపోకలకు పెద్ద అడ్డంకిగా మారాయని చెప్పారు. ఈ నిర్మాణాలను తక్షణమే తొలగించి విస్తరణ పనులకు వెసులుబాటు కల్పించాలని డిమాండ్ చేశారు.కొంతమంది గిరిజనేతరుల పక్షాన నిలబడుతున్న గిరిజన రాజకీయ నాయకుల తీరును గిరిజన సంఘం తీవ్రంగా ఖండించింది. కొంతమంది గిరిజన నిరుద్యోగులు ప్రభుత్వ సాయం లేకుండా నిర్మించుకున్న స్వయం ఉపాధి దుకాణాలు ఈ విస్తరణలో నష్టపోతున్నారని పేర్కొన్నారు. బాధిత గిరిజనులకు ఐటిడిఏ ద్వారా పునరావాసం కల్పించాలని, అవసరమైతే ఐటిడిఏ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గిరిజన సంఘం నేతలు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మే నెల రేషన్ బియ్యం అందజేత

రేషన్ ఇస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని పాత సుజన కోట గ్రామపంచాయతీ పరిధిలో కొత్త సుజన కోట గ్రామంలో 17 మంది రేషన్ లబ్ధిదారులకు మే మాసంలోని బియ్యంతో పాటు సరుకులు ఇవ్వలేదని గిరిజన సంఘం మండల కమిటీ సభ్యుడు ఆధ్వర్యంలో గురువారం తహసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపిన విషయం తెలిసిందే. మండల రెవెన్యూ శాఖ సీనియర్ అసిస్టెంట్ కామరాజు, సుజన కోట పంచాయతీ విఆర్ఓ భాస్కర్రావు లు తక్షణమే స్పందించి సరుకులను శుక్రవారం కొత్త సుజన కోట గ్రామంలో లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల కమిటీ సభ్యుడు గాసిరాం దొర మాట్లాడుతూ,సంబంధిత శాఖ అధికారులు విషయంపై స్పందించి రేషన్ డీలర్ ను బదిలీ చేయాలని కోరారు.
రెవిన్యూ శాఖ సీనియర్ అసిస్టెంట్ కామరాజు మాట్లాడుతూ, డీలర్‌ను బదిలీ చేసే విషయాన్ని తహసిల్దార్, జిసిసి మేనేజర్లను సిఫార్సు చేస్తామన్నారు.

జివిఎంసి విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న బాధితులు

పాల వెంకట అప్పలరాజును అరెస్ట్ చేయాలి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు డిమాండ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాంనగర్ ఏరియాలో మహిళల నుండి ఇళ్లు నిర్మిస్తామని చెప్పి రూ.3 కోట్లు కాజేసి పరారీలో ఉన్న పాల వెంకట అప్పలరాజును వెంటనే అరెస్ట్ చేయాలని, హైకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేయరాదని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.రాజు డిమాండ్ చేశారు. శనివారం రాంపురంలోని వెంకట అప్పలరాజు ఇంటి వద్ద నుంచి మోసపోయిన మహిళలు, వారి కుటుంబ సభ్యులతో పాల అప్పలరాజు ఫోటోకు చెప్పులు దండవేసి, జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, వెంకట అప్పలరాజు వల్ల మోసపోయిన మహిళలకు ప్రభుత్వం, పోలీసులు న్యాయం చేయాలన్నారు. హైకోర్టులో ఆయన పెట్టుకున్న బెయిల్ రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో బాధితురాలు బలగా రమణమ్మ, సిఐటియు జగదాంబ జూన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు, మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ వాలంటీర్‌కి ఆర్థికసాయం అందజేస్తున్న వైసిపి దక్షిణ ఇన్‌చార్జి వాసుపల్లి గణేష్‌కుమార్

'తల్లికి వందనం'లో రూ.2 వేలు కోత దారుణం

- మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తల్లికి వందనం పథకాన్ని ప్రకటించి గత ఏడాది అమలు చేయకుండా ఎగ్గొట్టిన చంద్రబాబు ప్రభుత్వం, ఈ ఏడాది పథకం అమలు చేస్తున్నామని చెప్పి, ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు ఇవ్వాల్సి ఉండగా, రూ.2 వేలుకోత పెట్టారని వైసిపి దక్షిణ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆరోపించారు. రకరకాల అభ్యంతరాలతో చాలామందికి ఈ పథకాన్ని వర్తింపు చేయలేదని ఆరోపించారు. శుక్రవారం ఆశీలుమెట్ట కార్యాలయంలో వాలంటరీగా పనిచేసిన మౌలాలి పంజా నూర్జహాన్ పిల్లల స్కూలు ఫీజు నిమిత్తం తన సొంత నిధులు రూ.5 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిందని, కొత్తగా ఒక్కరికి కూడా ఉద్యోగం ఇవ్వలేదు సరి కదా ఉన్న వాలంటరీ ఉద్యోగాలను తొలగించి యువతను రోడ్డును పడేసారన్నారు. కార్యక్రమంలో పార్టీ దక్షిణ నాయకులు,సత్య, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌పివి వ్యాక్సిన్‌పై అవగాహన అవసరం

కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా నేతత్వంలోని దేశవ్యాప్త ప్రజారోగ్య చొరవలో భాగంగా 'కాంకర్ హెచ్‌పివి అండ్ క్యాన్సర్ కాన్‌క్లేవ్ 2025'ను విశాఖలోని హోటల్ నోవాటల్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి మాట్లాడుతూ హెచ్‌పివి వ్యాక్సిన్ పై అవగాహన పెంచుకోవాలన్నారు. విదేశాల్లో ఈ వ్యాక్సిన్‌పై అవగాహన ఉందని, మనదేశంలో ఇంకా అంత ఆదరణ లభించలేదన్నారు. ముఖ్యంగా తొమ్మిదేళ్లు నిండిన బాలికలకు ఈ వ్యాక్సిన్ వేయించాలని, తొమ్మిదేళ్ళ నుంచి పాతిక సంవత్సరాల వరకు హెచ్‌పివి వ్యాక్సిన్ మంచి ప్రభావంతో పనిచేస్తుందన్నారు.హెచ్‌పివి కేవలం గర్భాశయ క్యాన్సర్‌కు మాత్రమే పరిమితం కాదని, వల్వా, యోని, పాయువు, పురుషాంగం, ఒరోఫారింక్స్ క్యాన్సర్‌లతో కూడా సంబంధం కలిగి ఉంటుందన్నారు. ఇది పురుషులు మహిళలు ఇద్దరినీ ప్రభావితం చేస్తుందన్నారు. 15 నుండి 25 సంవత్సరాల మధ్య హెచ్‌పివి ఇన్ఫెక్షన్ గరిష్టంగా ఉన్నందున, ముందస్తు అవగాహన సకాలంలో నివారణచర్యలు చాలా అవసరం అన్నారు. ఇప్పుడు అందుబాటులో ఉన్న సరసమైన హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తో, హెచ్‌పీవీ సంబంధిత క్యాన్సర్‌ల నుండి ప్రతివ్యక్తిని రక్షించుకోగలమని చెప్పారు. ఐసిఐ /ఐఎఆర్‌సి ఇన్ఫర్మేషన్ సెంటర్ డేటా ప్రకారం భారతదేశం ఏటా 1.23 లక్షలకు పైగా కొత్త గర్భాశయ క్యాన్సర్ కేసులు, 77,000 కంటే ఎక్కువ సంబంధిత మరణాలను నివేదిస్తోందన్నారు. కార్య క్రమంలో వైద్య నిపుణులు నికిత హాస్పిటల్ డైరెక్టర్ అండ్ చీఫ్ కన్సల్టెంట్ గైనకాలజిస్ట్ డాక్టర్ సునందరాణి గుత్తా, ఆంధ్ర మెడికల్ కాలేజీ, కింగ్ జార్జ్ హాస్పిటల్ ప్రసూతి అండ్ గైనకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ రెడ్ల విద్యా రామ, మెడికోవర్ హాస్పిటల్ చీఫ్ నియోనాటాలజిస్ట్, విజయనగరం విమ్స్ మెడికల్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సాయి సునీల్‌కిషోర్ మానెమ్, నియోనాటాలజీలో ఫెలోషిప్, మదర్హీ ఉమెన్ అండ్ చిల్డ్రన్ హాస్పిటల్‌లో నియోనాటాలజిస్ట్ పీడియాట్రిషియన్ డాక్టర్ బుద్ధమురళి సంతోష్ ప్రసంగించారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఇసుకపల్లి వాణి

మురికివాడ వాసులపై కేసులు కొట్టివేత

గాంధీ విగ్రహం వద్ద విజయోత్సవం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : 2012 జనవరి 9న జీవిఎంసి అధికారులు, పోలీసుఅధికారులు కలిసి విశాఖలోని మురికివాడల్లో నివసిస్తున్న 1200 మంది ప్రజలపై 3ఎఫ్ఐఆర్‌ల ద్వారా కేసులు నమోదు చేసి 94 మందిని అరెస్ట్ చేసి జైలుకి పంపిన కేసును విశాఖ సెషన్స్‌కోర్టు శుక్రవారం కొట్టేసింది.ఈ నేపథ్యంలో వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జీవిఎంసి గాంధీ విగ్రహం వద్ద సాయంత్రం విజయోత్సవం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రైటర్స్ అకాడమీ చైర్మన్, లీడర్ సంపాదకుడు వి.వి.రమణమూర్తి, న్యాయవాది కె.ఎస్.చలం, పిఒడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.లక్ష్మి , ఐఎఫ్ టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు దళితవిముక్తి రాష్ట్ర కన్వీనర్ ఎస్.వెంకటరమణ, సిపిఎం మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ మీడియాతో మాట్లాడుతూ మురికివాడ ప్రజలు సాగించిన పోరాటం న్యాయమైనదని కోర్టు తీర్పు ద్వారా మరోసారి రుజువైందని చెప్పారు. ఇప్పటికైనా జివిఎంసి అధికారులు రాజకీయ నాయకులు మురికివాడల ప్రజల హక్కులను గుర్తించాలని డిమాండ్ చేశారు. మురికివాడల్లో నివసిస్తున్న ప్రజలందరికీ పట్టాహక్కులు కల్పించి మౌలిక వసతులు కల్పించాలని వారు జీవించే హక్కును కాపాడాలని డిమాండ్ చేశారు. ఇందిరాగాంధీ కాలనీకి ఇప్పటికైనా సంపూర్ణమైన హక్కులు కల్పించాలని వారిని గౌరవప్రదంగా జీవించే విధంగా చేయాలని కోరారు.

తీర్పు అనంతరం కోర్టు ఆవరణలో మాట్లాడుతున్న న్యాయవాదులు తదితరులు

అన్యాయంగా విధుల నుంచి నిలిపేస్తారా ?

విశాఖ డెయిరీ కార్మికుల ఉధృత నిరసన

ప్రజాశక్తి - గాజువాక : అకారణంగా 450 మంది కాంట్రాక్టు కార్మికులను విశాఖ డెయిరీ యాజమాన్యం విధుల నుంచి నిలిపివేయడం పట్ల కార్మికులు భగ్గుమన్నారు. వారంతా శుక్రవారం డెయిరీ గేటు వద్ద, అక్కిరెడ్డిపాలెం వద్ద నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా మహిళా కార్మికులు మాట్లాడుతూ తమను విధుల్లోకి తీసుకోకపోతే కదిలేది లేదని స్పష్టం చేశారు. చావనైనా చస్తాంగానీ పట్టువదిలేది లేదన్నారు. తాము ఏ తప్పూ చేయకున్నా విధుల నుంచి నిలిపివేశారని మండిపడ్డారు. 15 నుంచి 20 సంవత్సరాలు సర్వీసున్న తమకు కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ సదుపాయాలు లేవన్నారు.

పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు మృగ్యమయ్యాయన్నారు. తాము గతంలో పోరాడినప్పుడు పర్మినెంట్ చేస్తామని చెప్పి నేడు దొడ్డిదారిన వేరే వారిని నియమించాలని చూస్తున్నారన్నారు. డెయిరీలో పనిచేస్తున్న హెచ్‌ఆర్ అధికారి చిట్టిబాబు ఇదంతా చేస్తున్నారని దుయ్యబట్టారు.

స్కోడా ఉత్పత్తులకు స్పందన

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : 130 ఏళ్ల చరిత్ర కలిగిన స్కోడా ఆటోకు 2025లో విశేష స్పందన లభిస్తోందని భారత మార్కెట్లో పోటీ తత్వాన్ని పెంచేందుకు కీలకమైన బ్రాండ్‌గా పనిచేస్తుందని స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ ఆశిష్ గుప్తా అన్నారు. విశాఖలోని స్కోడా ఆటో షోరూంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కోడా ఆటో ఉత్పత్తులు వ్యూహాత్మకంగా వినియోగదారుల అభివృద్ధి చెందుతున్న అవసరాలను ఆకాంక్షలను నెరవేర్చే విధంగా రూపొందించామని నెట్‌వర్క్‌ను విస్తరించుకుంటూ నాణ్యత, భద్రత, విలువలను కాపాడుతూ ముందుకు సాగుతున్నామని ఆయన అన్నారు. 2025లో ప్రతి ఒక్కరికి ఎస్‌యువి అనే నినాదంతో ముందుకు వెళుతున్నామని ఈ ఏడాది కైలాక్, కుషాక్, కోడియాక్ వాహనాలు మార్కెట్లో తమకు మరింత గుర్తింపుని తెచ్చాయన్నారు.

అతిత్వరలో స్కోడా ఆటో ఇండియా గ్లోబల్ ఐకాన్ ద్వారా నడిచే నూతన సెడాన్ వాహనాన్ని మార్కెట్లో విడుదల చేయబోతుందని తెలిపారు. తమ సంస్థ ఇప్పటి వరకూ భారతదేశంలో 165 పైగా నగరాల్లో అందుబాటులో ఉందని ఈ ఏడాది 200పైగా నగరాలకు విస్తరించి లక్ష్యాన్ని చేరుకునేందుకు సమిష్టి కృషితో పని చేస్తున్నామని ప్రస్తుతం 290 టచ్ పాయింట్లతో వినియోగదారులకు సేవలు అందిస్తున్నామని ఈ ఏడాది చివరినాటికి 350 టచ్ పాయింట్లు నెలకొంపడం లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన తెలిపారు.

జివిఎంసి ప్రధాన ఇంజనీర్‌గా పల్లంరాజు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : మహావిశాఖపట్నం నగర పాలక సంస్థ ప్రధాన ఇంజనీరుగా జి.వి.పల్లంరాజు శుక్రవారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో బాధ్యతలు స్వీకరించారు. మే 31న జివిఎంసి ప్రధాన ఇంజనీర్‌గా ఉన్న పి.శివప్రసాదరాజు ఉద్యోగ విరమణ పొందడంతో ఆయన స్థానంలో జివిఎంసి పర్యవేక్షక ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న జి.వి.పల్లంరాజును పూర్తి అదనపు బాధ్యతలతో (ఎఫ్ఎసి) జివిఎంసి ప్రధాన ఇంజనీర్‌గా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్.సురేష్‌బాబు నియమించారు.

మద్యం వ్యసనం నుంచి బయటపడ్డ వ్యక్తి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురానికి చెందిన భీమ శంకర్ (36) అనే వ్యక్తి మద్యానికి బానిసై, ప్రమాదానికి గురై తలకి, కాలికి గాయాలు కావడం, ఆసుపత్రి పాలు కావడం జరిగింది. 8 ఏళ్ల నుండి మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతో గొడవపడి, ఏడు మాసాల క్రితం ఇంటి నుంచి పారిపోయాడు.ఎయుటిడి సిబ్బంది రెస్క్యూ చేసి శ్రద్ధా దగ్గర మందులు వాడటంతో కోలుకున్నాడు. దీంతో భీమశంకర్‌ను శుక్రవారం విశాఖ నుంచి తీసుకువెళ్లి అతని తల్లి, తమ్ముడు మేడిశెట్టి ఆదినారాయణ కు అప్పగించడం జరిగిందని ఎయుటిడి కార్యదర్శి ప్రగడ వాసు మీడియాకు తెలిపారు. భీమశంకర్‌కి తల్లి, ఇద్దరు అన్నదమ్ములు ఉన్నారు. వివాహం జరిగింది ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారని తెలిపారు.

యోగా దినోత్సవానికి ముమ్మర ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 21న జరగనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు విశాఖ జాతీయ ఆతిథ్య నగరంగా ఎంపిక కావడంతో నగరంలో ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి సంబంధించి ఆయుష్ మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సీనియర్ అధికారులతో కలిసి సమగ్ర క్షేత్ర పరిశీలన, సమీక్షా సమావేశాలు శుక్రవారం జరిగాయి. ఈ సందర్భంగా ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ రాజేష్ కోటెచా, ఎపి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి.కృష్ణబాబు నేతృత్వంలో అధికారులు రుషికొండ బీచ్, ఆర్‌కె బీచ్, ఆంధ్ర యూనివర్సిటీ, గీతం విశ్వవిద్యాలయం వంటి ప్రధాన వేదికలను సందర్శించారు. ఆయుష్ జాయింట్ సెక్రటరీ మోనాలిసా దాష్, విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, ఆరోగ్య, పట్టణ ప్రణాళిక, విఎంఆర్‌డిఎ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో యోగా ప్రదర్శనలతోపాటు సాంస్కృతిక, విద్యా, ఆరోగ్య సంబంధిత కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. సమీక్షలో అంతర్‌శాఖల సమన్వయం, భద్రతా ఏర్పాట్లు, మౌలిక వసతుల సిద్ధత, ప్రజల భాగస్వామ్యం తదితర అంశాలపై సుదీర్ఘ చర్చ జరిగింది. విశాఖలో ఐదు లక్షల మందితో ఒకేసారి యోగా విన్యాసాలు జరుగనున్నట్టు అధికారులు తెలిపారు. జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులతో రాష్ట్ర నోడల్ అధికారి ఎమ్‌టి.కృష్ణబాబు ఎయు కన్వెన్షన్ హాలు సమీపంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. సమన్వయం వహించి యోగా దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.